నేటి నిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 24-2-2022

## నేటి దృశ్యం




రేపటి బాల్యానికి
మెతుకు కరువు
ప్రభుత ప్రకటన
షడ్ర సోపేతం!

లేతాకులకు
నేలమెతుకులా?
పథకాలన్నీ
ప్రక్క దారులా?

కుక్కలతో కాట్లాడే
ఆపటి తరం
కుక్కిన పేనులా
నాయకవర్గం!



-కిలపర్తి దాలినాయుడు
7780589336

## ఘంటారావం

బంధుత్వం దూరమైతే
అంధత్వం
శత్రుత్వం చేరువైతే
అభద్రత్వం.

ఆలోచించి అడోగేస్తే
ఆదర్శపథం
అడుగేసి ఆలోచిస్తే
అస్థిర రథం.

నిస్సహాయుల ముసుగులో
మోసం చేసేవాళ్ళుంటారు
జాగరూకత లేకుంటే
జీవితమే కాజేస్తారు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# కళలకు నిలయం నాగర్ కర్నూల్ : మంత్రి నిరంజన్‌రెడ్డి

నాగర్ కర్నూల్ ప్రాంతం కవులు, కళాకారులకు, ఉద్యమాలకు నిలయమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సామాజిక రంగంలో విశేష కృషి చేసిన సామాజిక వేత్త దుశర్ల సత్యనారాయణ, కవి నాళేశ్వరం శంకరంలకు జిల్లా కేంద్రంలోని సి.ఎన్.ఆర్.పాఠశాలలో చింతలపల్లి నిర్మలాదేవి నారాయణరావు 2021, 2022, జీవనసాఫల్యపు రస్కారాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దుశర్ల సత్యనారాయణ జలసాధన సమితి తరుపున ఫ్లోరోసిస్ నిర్మూలనకు కృషి చేశారని, నాళేశ్వరం శంకరం సాహిత్య రంగంలో గొప్ప కృషి చేసిన వీరికి ఈ అవార్డులు ఇవ్వడం సముచితమన్నారు. కందనూలు ప్రాంతం సాహిత్యానికి కందెనలాంటిదని తెలంగాణ ఉద్యమంలో కవులు కళాకారుల పాత్ర గణనీయమైనదని అన్నారు.

ఆ కాలం నుండి ఈ కాలంవరకు తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి కొరకు ఉద్యమాలు నడిచాయన్నారు.



డా॥నాళేశ్వరం శంకరంకు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తదితరులు.

నాడు పంటలు లేక వలసలు పోతే నేడు తెలంగాణ రాష్ట్రంలో పండుతున్నదని ధాన్యం కొనమని చేతులెత్తేసే పరిస్థితి కేంద్రానికి వచ్చిందంటే నీటిప్రవాహం మన జీవనంలో ఎంత ఉందో తెలుసుకోవచ్చు అని అన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ ప్రశస్తమైందని నాగర్ కర్నూలంటే బుద్ధుడు కేసరిసముద్రం సాహిత్యం ఈ అవార్డులు గుర్తుకొస్తాయని అన్నారు. దేశంలో ప్రజలమనసుల్లో మతం పేరుతో విషబీజాలు నాటుతున్నారని దీనిపై కవులు తమకలాలు జులిపించాలని కవులను కోరారు.

ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న మాట్లాడుతూ.. లౌకిక ప్రజాస్వామ్య విలువలకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. అలాగే మతోన్మాదానికి వ్యతిరేకంగా మానవీయ సమాజం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నాగర్‌కర్నూల్, సిఎన్ఆర్ స్కూల్, భాస్కర్ రావుతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గోరటి వెంకన్న గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రిజనార్ధన్ రెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యదర్శి కటికనేని మదన్ మోహన్, భాస్కర్ రావు, నాగవరం బాలరాం, చింతలపల్లి రాంచందర్ రావు, రంగినేని సుమతి, చంద్రకళ, విజయమోహన్, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కా రఘునందన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కల్పన, నిర్వాహకులు హెచ్.రమేష్ బాబు, వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్, బాలీశ్వర్, కల్వకోల్ మద్దిలేటి, కందికొండ మోహన్ తదితరులు ఉన్నారు.

## విప్లవ





లింగం
చుట్టూ
జనం-
లింగాల
మధ్య
జనజీవనం!



-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

పుస్తక సమీక్ష

# వికాసపుటి-వ్యాససంపుటి




సాహిత్యం- భాషాసంస్కృతి- దేశభక్తి- మహిళాభ్యుదయం- సామాజికం- మానవీయం- రాజకీయం- పర్యావరణం- యాత్ర ఇలా తొమ్మిది ప్రధాన శీర్షికలతో మరెన్నో ఉపశీర్షికలతో ఉన్న వ్యాససంపుటి ఇది. సుమారు యాభైఆరు వ్యాసాలున్నాయి. ఇందులో కొన్ని ఆకాశవాణిలో ప్రసారమైన ప్రసంగవ్యాసాలు, మరికొన్ని పత్రికలకు వ్రాసినవి. ఇవన్నీ 'కాలం' పరిమితికి లోబడి వ్రాసినవి. అందువల్ల రచయిత సంపూర్ణ భావావిష్కరణకు అవకాశం పరిమితం. ఉన్నదాంట్లో ఆయావిషయాలకు సంబంధించిన ముఖ్యాంశాల్ని వీరు వివరించారు. సరళమైన భాషతో సులభశైలితో ఉన్న ఈ వ్యాసాలు, సామాన్యులకు చేరువకావాలనే వీరి లక్ష్యాన్ని నెరవేర్చాయనటంలో సందేహంలేదు.

ఇంత వైవిధ్యంగల వ్యాసాలు వ్రాసే ప్రతిభ అందరికి ఉండదు.

ఈ వ్యాససంపుటిపేరు 'అక్షరం అమృతం'. ఈ పేరుతో ఒక వ్యాసం కూడా ఉన్నది. అమరులు కావటానికి దేవతలకు అమృతమున్నది. మరి మానవులు దేవతలు కావటానికి సాధనమేమిటి... అక్షరం. అదే విజ్ఞానం, అదే పుస్తకం. దీనికి గుర్తుగానే సరస్వతీదేవి చేతిలో పుస్తకముంటుంది. అక్షరం శాశ్వతమన్నదే ఈ రెండుమాటల భావం. లౌకిక అలౌకిక అర్థస్ఫూర్తిగల ఈ పేరు చాలాబాగున్నది.

రచయిత దృష్టి ఎప్పుడూ సామాన్యుల బాగోగుల్ని గురించి నిరంతరం ఆలోచించే లక్షణం ఈ వ్యాసాల్లో కనబడుతున్నది. సాహిత్యం అనేసరికి చాలామందికి పురాణాలు, కావ్యాలు గుర్తుకువస్తాయి. కానీ వీరికి సంకీర్తనలు, వాటినందించిన వాగ్గేయకారులు స్ఫురించారు. అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు మొదలైనవారిని గురించి వీరు విశేషంగా వివరించారు. కరుణశ్రీగారి కవితలోని దేశభక్తిని, బౌద్ధధర్మాన్ని, పాకీపిల్లను కవితావస్తువుగా స్వీకరించిన సామాజిక దృక్పథాన్ని వీరు తన వ్యాసంలో చక్కగా ఆవిష్కరించారు. గురజాడ సంస్కరణ సాహిత్యాన్ని వివరిస్తూ, తమిళకవి సుబ్రహ్మణ్య భారతికి దేశరాజధాని ఢిల్లీలో దక్కిన గౌరవం గురజాడకు దక్కనందుకు విచారించారు. ఇది ఒక రకంగా తెలుగువారికి సూచన, ఆక్షేపణ కూడా. జానపద కళలు జాతికి జీవనాడులన్న విషయాన్ని వీరొక వ్యాసంలో గుర్తు చేశారు. 'తెలుగు సాహిత్యంలో గొబ్బిపాటలు', 'దసరాకు సందడిచేసే కొలాటాలు' అనే వ్యాసాలు వీరికి పల్లెజీవనంపైగల అవగాహనను, మక్కువను తెలుపుతున్నాయి. 'పల్లెటూళ్ళలో పర్యావరణ పరిరక్షణ', 'పట్టణీకరణ' మొదలైన వ్యాసాల్లోకూడా గ్రామీణాభివృద్ధిని గురించి వారికి గల ఆలోచనాపరంపర, ఆకాంక్ష వ్యక్తమవుతున్నది.

'సాహిత్యం ఒక సజీవవాహిని' '(సాహిత్యం)' ఆది కవి నుండి నేటి కవి వరకు అందరిని పరిచయం చేసేది పుస్తకమే. (పఠనం) అన్న వీరి వాక్యాలు సర్వకాలీనమైన సత్యాలు.

ఎప్పుడో వ్రాసిన 'భద్రతలేని బ్రతుకులు' అన్న వీరి వ్యాసం వర్తమానానికి కూడా వర్తిస్తుంది. ఈ వ్యాసంలో వడగాడ్పులు, భూకంపాలు, వ్యాధులు మానవ మనుగడకు ముప్పు కలిగిస్తున్నాయని, దీనికి ప్రకృతి విధ్వంసమే కారణమని వారన్నమాటలు అక్షరసత్యాలు.

'దేవాలయాలు సాంస్కృతిక కేంద్రాలు' అన్న వ్యాసం వీరి సంప్రదాయబుద్ధికి విశ్లేషణాశక్తికి నిదర్శనం.

'దేశభక్తి' అనే వ్యాసంలో 'సేవతో కూడుకున్న భక్తి దేశభక్తి' అని భక్తిలో స్నేహం, వినయం, ప్రేమ కలిసివుంటాయని వీరు వ్యాఖ్యానించిన తీరు హృద్యంగా ఉన్నది.

స్వాతంత్ర్యంకోసం పాటుపడ్డ త్యాగమూర్తులైన యోధులు, కవులు, కళాకారులు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నిర్లక్ష్యానికి గురయ్యారు. గరిమెళ్ళ గురించి వ్రాసిన వ్యాసం అలాంటి వారందరినీ గుర్తుకు తెస్తున్నది. 'మాకొద్దీతెల్లదొరతనం' అని వ్రాసిన గేయం అందరికి తెలుసుగాని 'మాకొద్దీనల్లదొరతనం' అని వ్రాయ నిరాకరించిన విషయం చాలామందికి తెలియదు. రచయిత ఈ విషయం చెప్పి గరిమెళ్ళవారి ఘనతను నిలిపారు.

'పెదవి దాటితే' అన్న వ్యాసం సందేశాత్మకమైనది. 'మనలోని భావోద్రేకాలను సమాజంపై అనాలోచితంగా విసరకూడదు' అన్న వీరి హితోపదేశం, వక్తలు, రచయితలు, నాయకులు అందరు పాటించదగింది. ఓట్లకోసం ప్రభుత్వాలిచ్చే రాయితీలను కార్చిచ్చుతో పోల్చటం చాలా బాగున్నది. 'ఆలుమగల అనుబంధం- ప్రజాసంబంధాలపాత్ర' అన్నది గొప్ప వ్యాసం. అందరు ఆచరించినచో అన్యోన్యత, కుటుంబసంబంధాలు బాగుంటాయి. అలాంటి కుటుంబాలలో ప్రజాసంబంధాలుకూడా బాగుంటాయి. 'సహజీవనం' పేరుతో నేడు నడుస్తున్న వెర్రి వేషాల్ని నిరసించటం వీరి వాస్తవిక దృక్పథానికి అద్దం పడుతున్నది.

ఈ రచయిత ఇంత వైవిధ్యంగల వ్యాసాలు ఎలా వ్రాశారన్నది. ఇలాంటి వ్యాసాలు పాత్రికేయులే వ్రాయగలరు. సుబ్బారావుగారు 'సాహితీకిరణం మాసపత్రిక' సంపాదకులు. సుమారు 12 సంవత్సరాలుగా దిగ్విజయంగా నడుపుతున్నారు. అందువల్ల అనేక విషయాలపై అవగాహన వీరికేర్పడింది. పత్రిక సామాన్య ప్రజలకోసం కూడా కాబట్టి సులభశైలి, సరళవ్యక్తీకరణలు అలవడ్డాయి. ఈ వ్యాసాల్లో అక్కడక్కడ కవితాధోరణి కనబడుతున్నది. ఈయన 'వ్యంజకాలు' అనే కొత్త కవితాప్రక్రియకు సృష్టికర్త. సుమారు నాలుగు కవితాసంపుటులు, ఒక కథాసంపుటి, ఒక సంపాదకీయాల సంపుటి వెలువరించిన సాహిత్య కృషీవలుడు. అందుకే రచనాశైలిలో ఆ కవితాత్మకత. అన్ని వ్యాసాలలో తార్కిక దృష్టి. సామాజిక స్పృహ గోచరిస్తాయి. వీరు సమాచారశాఖలో ఉన్నతోద్యోగం చేసి పదవీవిరమణ చేసారు. ఏ విషయాన్ని ఎలా, ఎంత వరకు వ్రాయాలన్న ఔచిత్యాన్ని వీరికా ఉద్యోగం నేర్పిందనుకుంటాను. ఈ సంపుటి వ్యక్తిత్వ వికాసానికి తప్పక తోడ్పడుతుంది.

**ప్రతులకు:**
సాహితీకిరణం,
ఇం.నెం.11-13-154,
అలకాపురి, రోడ్‌నెం.3,
హైదరాబాద్- 500102.
సెల్:9490751681



-పింగళి
వేంకటకృష్ణారావు
సెల్:9440185122

## పుస్తకంతో ప్రయాణం..

ఎవరు వెంట లేకున్నా
బస్సులో వెంట పుస్తకం ఉండాల్సిందే
పక్కన సందడి తెల్వదు
దూరం తెల్వదు
ఒంటరితనం దూరం దూరం
ప్రయాణమంతా పుస్తకంలోనే !

పుస్తకం చదువుతుంటే
రచయితతో కలిసి ప్రయాణం చేసినట్లే
పాత్రలతో తోడుగా ప్రయాణం
పాత్రల ఆనందం మన ఆనందం
పాత్రల దుఃఖం మన దుఃఖం
ఎన్ని పుస్తకాలు చదివితే అందరు మిత్రులు
లెక్కకు అందని మిత్రులు
జీవన సత్యాలను పేరాలు పేరాలుగా
పేజీలు పేజీలుగా చెప్పే మిత్రులు పుస్తకాలు.

మన మనస్సు మనం చదివిన పుస్తకాలతో
జీవిత కాలమంతా సంచారంగా
ఎప్పటికీ ఎగ్జిబిషనే !

ఈ రోజు కొత్త పుస్తకం కొన్నాను
ఇంకొక దోస్త్ దొరికినట్లు



- కందాళై
రాఘవాచార్య
8790593638

## నేడు

బండ రాళ్ళపై
కొండ కొనలపై
చెట్టు మొదళ్ళపై
గట్టు అంచులపై

బస్సుసీట్లపై
గ్లాసు బాటిళ్ళపై
భవన శిఖరాలపై
ప్రహరీ గోడలపై

పార్కు బెంచీలపై
కాలేజీ డెస్కులపై
శిథిల శకలాలపై
చారిత్రక కట్టడాలపై

బట్టల నేతల్లో
ఎంబ్రాయిడరీ కుట్లల్లో
రైలు పెట్టెల్లో
ఆల్చిప్పల్లో

పచ్చ బొట్లల్లో
పుష్కర రేవుల్లో
దుప్పట్ల ప్రింట్లల్లో
గిఫ్ట్ ప్యాకెట్లలో

ముఖ పుస్తకాల్లో
వాట్సాప్ సందేశాల్లో
వెండి బంగారు హారాల్లో
జంటలు చేసే విహారాల్లో

ఎటు చూస్తే అటు
ఎక్కడంటే అక్కడ
కుప్పలు తెప్పలుగా
కనిపిస్తుంది 'ప్రేమ'..నేడు
అది ఉండాల్సిన
మనిషి మనసులో తప్పు!



- ఎస్. కాశింబి
సెల్: 9052216044

## ప్రేమ నువ్వెక్కడ

అవును వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు
అలా విడిపోతున్నారు.
ఆ ప్రేమకి 60ఏళ్ళు
అమ్మా, నాన్న ప్రేమించుకున్నారు
పెళ్ళి కూడా చేసుకున్నారు
ఆరేళ్ళకే విడిపోయారు
కలికాలం-
ఇలా ప్రేమించుకుంటున్నారు
తెలివైన ప్రేమికులు కదా
అరవై ఏళ్ళ ప్రేమ- ప్రేమా?
ఆరేళ్ళ ప్రేమ-ప్రేమా
ప్రేమంటె 'డబ్బా', మొసమా,
ఆకర్షణా, త్యాగమా
ఏది సత్యం, ఏద సత్యం.



- సత్యం
సెల్: 9100495714

## కాలం క్లారిటీ !

ఉరుములు మెరుపులతో
వచ్చే గాలివానకు
ఎంతమంచి గొడుగు
వాడినా ఉపయోగముండదు !.

చేదుగా ఉండే
కాకరకాయ మొక్కకు
ఎంతమంచి నీళ్ళతో
పెంచినా ప్రయోజనముండదు !

కొమ్మనిండా ఆకుల చాటున
ముళ్ళుండే కంప చెట్టుకు
ఎంతమంచి ఎరువువేసి
సాదినా ఫలితముండదు!

ఓర్చుకోవడం నేర్చుకుంటూ
ఒడిదొడుకులను తట్టుకొంటే
ఒంటరిగానైనా కొన్నాళ్ళకు
ఒద్దికగా నిలబడుతాం !!

జీవిత పయనంలో , ఆర్థిక
అవసరాలకు కలిసే స్నేహాలన్నీ
అలలా వచ్చి కలలా మిగిలేవే
పంట పాడుజేసే వడగళ్ళ వానలే !

గుణహీనమైన అందాలు
వ్యక్తిత్వంలేని బంధాలు ,
ఆధారపడే అనుబంధాలు
ఎన్నటికైనా అనర్థమే !

ఏదేమైనా ... సృష్టికర్త
భజన పరులను, చెంచాలను
ఊసరవెళ్ళులను ,గోడమీది పిల్లులను
కాలం నేర్పే క్లారిటీతో
వయసు తెచ్చే అనుభవంతో
మనకెదురైన ఈ మనుషులు
బ్రతకటానికి ఇంకెన్నో నేర్పుతారని
తెలుసుకొని తెగువతో జీవించాలని
మనో నేత్ర దృష్టితో లోకంలో వదిలాడు ! !



-రాజేశ్
9440460490

## మాట విందాం..

అమ్మ అలిగింది నాపై...
అన్నం తినడం లేదని
ఆటలకు దూరంగా ఉంటున్నానని
వేళకు నిద్రపోవడం లేదని
చరవాణి వదలడం లేదని
చివరగా మందలించింది
వీపున ఒకటి చరిచి....

గురువు గద్దించారు నన్ను....
వ్యాకరణం నేర్చుకోవడం లేదని
లెక్కలు తప్పుతున్నాయని
సైన్స్ చావడం లేదని
సాంఘికంపై శ్రద్ధ చూపడం లేదని
చివరకు పరీక్షల్లో తప్పాననీ
హితవు చెబుతూ మొట్టికాయ వేశారు...

ప్రకృతి ప్రకోపించింది మనపై...
మొక్కలను నాటడం లేదని
అడవులు నాశనం చేస్తున్నామని
పుడమిని తవ్వేస్తున్నామని
నదీపరివాహకాన్ని ఆక్రమించుకుంటున్నామని
సముద్రాన్ని కలుషితం చేస్తున్నామని
హెచ్చరిక చేస్తున్నది
అకాల వానలు, వరదలు, తుఫానులతో

మరొక అవకాశం ఇస్తుందో లేదో?
మనం మారి పుడమిని కాపాడుకుందాం
ప్రకృతిని ప్రసన్నం చేసుకుందాం.

-చిన్నయ్య గునిశెట్టి
సెల్: 9441804908

# 'మరణానంతరమూ నిలిచేది వ్యక్తిత్వం'-డా॥కె.వి.రమణాచారి

మరణానంతరం కూడా వ్యక్తుల జ్ఞాపకాలు వారి ఉత్తమ వ్యక్తిత్వాలు నిలిచివుంటాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై ఆదివారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ నిర్వహణ లో యువ నాయకుడు తెలంగాణ అభిమాని రాయప్రోలు 'ఫణిభార్గవ్ యాదిలో' పేరిట జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ కుమారుని మృతిని జ్ఞాపకాలుగా మిగుల్చుకోకుండా అతని ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఏటా కొందరు పేద విద్యార్థులు, అనాథ, వికలాం గుల సేవా కేంద్రాలకు, జర్నలిస్టులు, కవులకు నగదు పురస్కారాలు బహూకరిస్తూ తన కుమారుని గుర్తులను శాశ్వతంగా సమాజంలో తండ్రి నిలుపుతున్నారని అభినందిం చారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ కార్యదర్శి వసుంధర మాట్లాడుతూ, యువకునిగా ఉన్న సమయంలోనే ఫణి భార్గవ్ సమాజానికి మంచి చేయాలన్న తపన పడడం ఉత్తమ సంస్కారమని చదువులో వృద్ధిలోకి వచ్చి పిన్న ప్రాయంలోనే లోకాన్ని వదలి వెళ్ళటం బాధాకరమన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ కవి డాక్టర్ ఎమ్.కె. రాము మాట్లాడుతూ, ఫణిభార్గవ్ జయంతిని యజ్ఞాతుల్యంగా కొనసాగించాలని కోరారు. గానసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి ఫణి భార్గవ్‌కు గానసభతో ఉన్న అనుబంధాన్ని తెలిపారు. నేటినిజం దిన పత్రిక సంపాదకులు బైస దేవదాసు, బిజేపి నాయకుడు వినయ్‌లు మాట్లాడుతూ, ఫణి భార్గవ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తినిస్తాయని అన్నారు.

అనంతరం నగదు పురస్కారాలను కవులు డాక్టర్ బాబావలి రావు, మిద్దె సురేష్, విద్యార్థి అమరేంద్రర్‌కు చైల్డ్ వికాస్ ఫౌండేషన్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమానికి తొలుత రాగాలయ సంస్థ మాధవి, మంతా శ్రీనివాస్ శిష్యులు నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, కళాసృష్టి సుష్మ శిష్యుల కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులని రసానందంలో ముంచెత్తాయి.




ఆదివారం త్యాగరాయ గానసభలో "ఫణిభార్గవ్ యాది" కార్యక్రమంలో పురస్కార గ్రహీతలతో ఎ. సురేంద్ర, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, జి. వసుంధర్, డా॥యం.కె.రాము, డా॥ కె.వి.రమణాచారి, కళా వి.యస్.జనార్ధనమూర్తి, శ్రీమతి ఎ.పుష్పలత తదితరులు.



బీసీ కమీషన్ చైర్మన్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన వకుళాభరణం కృష్ణమోహన్‌రావు గారిని అభినందిస్తున్న బీసీ కమీషన్ తొలి చైర్మన్ బి.ఎస్.రాములు.




కళాకారులను సత్కరిస్తున్న అతిథులు.

# మొదటి బహుమతి

(కథ)

వృత్తిరీత్యా ఎక్కడున్న సెలవులు రాగానే వెంటనే మా ఊరికి వచ్చి చేరుతాను. అలాగే నేను పదో తరగతి వరకు చదువుకున్న స్కూల్ దగ్గరికి మిత్రులతో లేదా ఒంటరిగానైనా ఖచ్చితంగ వెళ్ళి కూర్చోవడం నాకు అలవాటు. అలా కూర్చుండి నా చిన్నప్పటి సంఘటనలను, మిత్రులను,టీచర్లను యాది చేసుకుంటూ సంతోషపడిపోతుంటాను.

ఎప్పటిలాగా మా బడి వరండాలో కూర్చున్నాను. ఆ వాతవరణం,ఆ రోజులు,ఆ దోస్తులు, టీచర్లు మల్లోక సారీ వస్తే ఎంత బాగుండో అని ఆలోచిస్తున్నాను.

అంతలో అక్కడికి కొందరు పిల్లలు వచ్చి క్రికెట్ ఆడుతున్నారు. ఒక పిల్లవాడు మాత్రం తనను ఎవరు కోరుకోలేదు అని ఏడుస్తున్నాడు. అది చూడగానే నా చిన్నప్పటి సంఘటన ఒకటి యాద్కచ్చింది. బడిలో జరిగే ప్రతి సంఘటన కూడ మనల్ని నవ్వించేది,ఏడిపించేది లేదా ఏదోకటి నేర్పించేదిగా ఉంటుంది. అలాంటి సంఘటన నా చిన్నప్పుడు ఒకటి జరిగింది. ×

ఆ రోజు సాయంత్రం మా బడిలో అందరు గ్రౌండ్ లో ఆటలు ఆడుతున్నారు. నేను తరగతి గదిలోనే కిటికీ పక్కన కూసోని వాళ్ళను చూస్తూ నా బొమ్మల పుస్తకంలో మెగాస్టార్ చిరంజీవి బొమ్మ గిస్తున్నాను.

అంతలో మా తరగతి గదిలోకి మా లెక్కల సర్ రాజేంద్రప్రసాద్ గారు వచ్చారు. సర్ నన్ను చూసి "అరేయ్ ఏంట్రా మధు నువ్వు ఆడుకోవడానికి పోలేదా?" అన్నాడు.

"లేదు సర్ పోలేను" అని అన్నాను. సర్ "ఎందుకురా?" అన్నాడు. నేను కొంచెం మెల్లగా' 'సర్ ఏం ఆడుతాం సర్ ఈ ఆటలు నాకు పెద్దగా ఆడబుద్దికాదు సార్ వట్టిగా దెబ్బలు తాకుతాయి" అన్నాను.

సర్ చిన్నగా నవ్వుతూ నా దగ్గరికి వచ్చి,పక్కన కూర్చొని బొమ్మల పుస్తకం తీసుకొని చూస్తూ,నా భుజం మీద చెయ్యి వేసాడు. నాకు పట్టరానంత సంతోషంగా ఉంది. కొంచెం దూరంగా ఉన్న ఇద్దరు అమ్మాయిలు మమ్మల్నే చూస్తున్నారు. వారిద్దరు మా తరగతిలోనే అందరికంటే అందంగా ఉంటారు. అందరు వాళ్ళను చూస్తే వారు మాత్రం నన్ను చూసేవారు, చదువులో నాతో పోటిపడేవారు.

నాకు ఎందుకంత సంతోషం అంటే రాజేంద్రప్రసాద్ సర్ అంటే మా బడిలో,మా ఊరిలో అందరికి ఇష్టంతో కూడిన గౌరవం వల్ల వచ్చిన భయం ఉండేది. ఎందుకంటే సర్ మా బడిలో చదువు చెప్పవట్టి ఎనిమిది,తొమ్మిదేండ్లు అయితుంది. ప్రైమరీస్కూలు నుండి హైస్కూల్ కి మారారు.

సర్ క్లాస్ చెపుతుంటే అందరు కోయ్యబారుగా కుసుంటారు,ఎవ్వరు మెడలు కూడా పక్కకు తిప్పరు,కొందరైతే గజగజ వణుకుతారు. 'కానీ సర్ అంటే అందరికి చాల ఇష్టం కాని,సర్ కి నేనంటే ఇష్టం.'

సర్ నా బొమ్మల పుస్తకం పూర్తిగా చూసి "అరేయ్ మధు నీకు డ్రాయింగ్ లో కూడా మంచి టాలెంట్ ఉందిరా అన్ని బొమ్మలు మంచిగా గీసావు వెరి గుడ్" అన్నాడు. నేను "తాంక్స్ సర్" అన్నాను.

సర్ అలాగే నా భుజం మిద చేయివేసి తీసుకు వెళ్తున్నాడు. వరండాలో నుండి నడుస్తూ "అరేయ్ మధు నువ్వు ఏం పరీక్షా పెట్టినా అన్నిట్లో ఫస్ట్ వస్తావు. కాని ఆటలంటే భయపడుతావు ఏందిరా?" అన్నాడు. "సార్ భయం కాదు నచ్చదు అంతే!" అన్నాను. అప్పుడు సర్ "అరేయ్ ఎప్పుడైనా నువ్వు గ్రౌండ్ లో దోస్తులతోని ఆడితే కదా! నచ్చుతుందో,లేదో అని తెలుస్తుంది. అరేయ్ మన జీవితంలో కేవలం చదువు ఒక్కటే ఉంటే చాలదు.

చదువుతో పాటు ఇంకా చాల అవసరం ఉంటాయి. ముఖ్యంగా పిల్లలకు శారీరక,మానసిక బలం అభివృద్ధి అయ్యేది ఆటలు,పాటలవల్లనే ఖచ్చితంగ చదువుతో పాటు ఆటలు కూడా ఉండాలి సరేనా ఆడుదాం పా" అని నన్ను క్రికెట్ మైదానంలోకి తీసుకెళ్ళాడు. అక్కడ నా పై తరగతివారు,నా దోస్తులు క్రికెట్ కోసం టీంలు కోరుకుంటున్నారు.

ఇద్దరు కెప్టెన్ లు వరుసగా అందరిని కోరుకుంటున్నారు. నన్ను మాత్రం ఎవరు కోరుకోవడం లేదు.

చివరివరకు నా వైపు కూడా ఎవ్వరు చూడటం లేదు.

> **'మనకు రానిదాని కోసం బాధ పడక్కర్లేదు? మనం ఎందులో రాణించగలమో అనేది తెలుసుకోవాలి"**

బ్యాటింగ్ టాస్ కూడా వేస్తున్నారు.

అక్కడ ప్రసాద్ సర్ వెళ్లి బ్యాటింగ్ పట్టి ట్రయల్ బాల్స్ ఆడుతున్నారు.

నన్ను కోరుకొని విషయం సర్ కి తెలియదు.

టాస్ గెలిచి కొందరు ఫీల్డింగ్ సెట్ చేస్తున్నారు.

నాకు ఇజ్జత్ పోయినట్టు అనిపించింది. అప్పుడు అర్థమైంది 'నేను క్లాస్ రూమ్ లో హీరో కానీ మైదానం లో జీరో'అని ఇక అక్కడ ఉండకూడదు అనుకుని అటుపక్కనున్న చింత చెట్టు కిందకి వెళ్లాను.

అక్కడ ఆట చూడటానికి చాల మంది ఉన్నారు. నేను వాళ్ళతో కూర్చుందాం అని వెళ్తుండగా మా ప్రసాద్ సర్ "అరేయ్ మధు నువ్వు ఎట్రా? అడుతా అని వచ్చి వెళ్ళి పోతున్నావు అరేయ్ వాన్ని ఎవరు కోరుకోలేరా? రారా అడుదువు రా" అని పిలవడంతో నేను వెళ్లి ఫీల్డింగ్ చేస్తున్నాను.

ఆట మొదలైంది,ఒక ఓవర్ అయిపోయింది. నా వైపు ఒక్క బాల్ కూడా రాలేదు. నేను బీరిపోయి నిల్చున్నాను అంతలో బాల్ వేగంతో నా వైపు దూసుకుపోయింది. అది నేను ఆపలేకపోయాను ఫోర్ పోయింది.

వెంటనే ఇంకో బాల్ కూడా మిస్ అయ్యి బౌండరీ దాటింది. ఇక నా వైపు అందరు కోపంగా చూసారు. అప్పుడు సర్ "పర్వాలేదురా మధు మంచిగానే ఆడుతున్నావు" అని దగ్గరికి వచ్చి ఎలా ఆడాలో నాకు కొన్ని సలహాలు ఇచ్చాడు. తరువాత మొత్తం ఒక్క బాల్ కూడా మిస్ చేయలేదు.

ఆట ఆశక్తిగా సాగుతున్నది,అందరితో పాటు ఆ నా తరగతి అమ్మాయిలు కూడా చూస్తున్నారు.

హోరాహోరీ పోరు తర్వాత ఆట ముగిసింది.

కేవలం రెండు పరుగుల తేడాతో మా టీం ఓడిపోయింది.

అందరు నేను చేయబట్టే ఓడిపోయింది అన్నట్టు చూసారు,

కొందరు తిట్టారు. కాని నేను బాధపడలేదు,

ఎలాగైనా సరే క్రికెట్ ఆట నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను.

మా ఇంటివెనుక పెరట్లోనే క్రికెట్ గ్రౌండ్ చేసుకొని,నేనే డబ్బులు జమ చేసుకోని ఒక బ్యాట్,బాల్ కొనుక్కొని మా పెరట్లోనే క్రికెట్ ఆట ప్రారంభించాను. రోజు సాయంత్రం ప్రాక్టిస్ చేసేవాన్ని ,మా స్కూల్లో ఎప్పుడు క్రికెట్ ఆడినా వెళ్లి నిల్చునేవాడిని,అయినా నన్ను ఏదో చివర్లో ఎక్స్ట్రా ప్లేయర్ లెక్క తీసుకునేవారు.

నేను ఎంత ట్రై చేసిన ఒక్క ఆటలో కూడా ఒక్క రన్ తియలేకపోయాను. రాత్రి-పగలు ప్రాక్టీస్ చేసిన బౌలింగ్ వేయడం నేర్చుకున్నాను. ఎప్పుడు చాంపియన్ అనుకునే నేను ఈ క్రికెట్ ఆట కోసం కొందరి తిట్లు,మరి కొందరి ఉచిత సలహాలు,కొందరు అవమానాలు అన్ని అనుభవిస్తూ మొత్తానికి ఆట నేర్చుకున్నాను.

జనవరి 26 కి మా స్కూల్లో ఆటల పోటీలు జరుగుతున్నాయి. ఏలాగు నన్ను ఎవరు కోరుకోరు అని నేనే కెప్టెన్ ఉండి టీం కోరుకున్నాను. క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది, నేను ఎంత గట్టిగా ప్రయత్నించినా నా టీం చిత్తుగా ఓడిపోయింది. అందరు నవ్వారు,ఆ ఇద్దరు అమ్మాయిలు అయ్యో పాపం అన్నట్టు చూసారు.

నేను ఒక్కడినే నా తరగతి గదిలోకి వెళ్లి చివరి బెంచ్ లో కూర్చుని ఏదో కోల్పోయినట్టు ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాను.

బయట ఆటల పోటీలు జరుగుతున్నాయి.

అప్పుడు నా దగ్గరికి మా సర్ వచ్చి నా పక్కన కూర్చుని ఓదార్చాడు. "మధు ఎప్పుడైన అన్ని చాలెంజ్ గా తీసుకునే నువ్వు ఈ చిన్నదానికి ఏడుస్తున్నవా " అన్నాడు. అప్పుడు నేను "సర్ నేను చాల కష్టపడి నేర్చుకున్నాను,చాల ప్రాక్టీసు కూడ చేసాను సర్ మరి నాకెందుకు ఈ క్రికెట్ అబ్బలేదు." అని బోరునా ఏడ్చాను. అప్పుడు సర్ "అరేయ్ నిన్ను ఆటలు ఆడుమని చెప్పినా కాని కేవలం క్రికెట్ మాత్రమే ఆడమని కాదు....అయినా నువ్వు అన్నిట్లో ఫస్ట్ ఉంటావు,ఏదైనా పట్టుబట్టి నేర్చుకుంటావు.

అలాగే క్రికెట్ కూడా నేర్చుకున్నావు కాని అందులో సరిగ్గా రాణించలేదు అంతేగా! అందుకు ఏడవాల? నీవు ఏ ఆటలో రాణించగలవో తెలుసుకో? ఒక్క క్రికెట్ ఆటనే కాదు కబడ్డీ,కోకో,వాలీబాల్ ఇంకా చాల ఆటలు ఉన్నాయి. ఆ ఆటలనన్నీ ఆడిచూడు. ఒక్కొక్కలకు ఒక్కో దాంట్లో ప్రతిభ ఉంటది. సరేనా" అన్నాడు. నేను "సరే సర్" అని ఇంటికి వెళ్ళాను.

మరుసటి రోజు బడికి వచ్చి కబడ్డీ టీం తీసుకున్నాను.

అట మొదలైనప్పటి నుండి నేను ఆగలేదు ఆడుతూనే ఉన్నాను, గెలుస్తూనే ఉన్నాను.

తర్వాత కోకో ఆటలో కూడా గెలిచాను. ఆ తర్వాత వాలీబాల్ ఆటలో కూడా నేనే గెలిచాను.

ఇంకా ఇండోర్ గేమ్స్ చెస్ ,క్యారం బోర్డ్ ,మెమరీ టెస్ట్ లాంటి అన్ని గేముల్లో నాదే

"మొదటి బహుమతి,

ఒక క్రికెట్ లో తప్ప!" '

'మనకు రానిదాని కోసం బాధ పడక్కర్లేదు? మనం ఎందులో రాణించగలమో అనేది తెలుసుకోవాలి"

అని ఆ రోజు బడి ఒడిలో తెలుసుకున్నాను.



-అనిల్ కంటే
9849553995

# పట్టణ దర్శనం

అమాయకపు గుట్టన్న కథలు (పిల్లల హాస్య కథలు)

గుట్టన్న ఒకసారి మిత్రులతో కలిసి పట్నం వెళ్ళాడు. అక్కడ పెద్ద పెద్ద భవనాలు, రోడ్లు, వాహనాలు చూసి అతడు ఆశ్చర్యపోయాడు. అతడు మిత్రునితో సిటీ బస్సు స్టాప్ దగ్గరికి వెళ్ళాడు. బస్సు ఎంతకూ రాక పోవడంతో వాడు అక్కడ బేంచీపై కూర్చున్నాడు .

ఇంతలో బస్సు వచ్చి ఒక నిమిషం ఆగి బయలుదేరింది. మిత్రుడు ఎంత పిలిచినా ' ఎక్కుదాం లే 'అన్నట్టుగా గుట్టన్న లేవలేదు. ఇంతలో బస్సు వెళ్లి పోయింది. అతడు గుట్టన్నను తిట్టి ఎందుకు రాలేదని అడిగాడు. మన ఊరు వలె ఇక్కడ కూడా డ్రైవర్ ,కండక్టర్ టీ తాగుతారని, బస్సు అరగంట ఆపుతారని రాలేదని గుట్టన్న అన్నాడు. గుట్టన్న మిత్రుడు నవ్వి" నీ మొహం !ఇక్కడ బస్సు ఒక్క నిమిషం కూడా ఆగదు" అని అన్నాడు. వెంటనే వచ్చిన మరొక బస్సులో మిత్రుడు గుట్టన్నను ఒక్క తోపు తోసి మరీ ఎక్కాడు. ఆ బస్సులో జనం క్రిక్కిరిసి ఉన్నారు.

కండక్టర్ గుట్టన్నను ముందుగా టికెట్ అడిగాడు. గుట్టన్న వంద రూపాయల నోటు ఇచ్చాడు. కండక్టర్ ఎక్కడికని అడిగాడు. "నాకు ఎక్కడ దిగాలో తెలియదు .టిక్కెట్ ఎక్కడికి తీసుకోవాలో అంతకన్నా తెలియదు. అందుకే ఈ బస్సు స్టాప్ చివరి వరకు టికెట్ ఇవ్వండి " అని గుట్టన్న అన్నాడు .అప్పుడు కండక్టర్ కోపంతో "దిగు ! దిగు!ఐదు రూపాయల టికెట్ కు వంద రూపాయలు ఇస్తావా! నా దగ్గర చిల్లర లేవు" అని బస్సు పై ఒక దెబ్బ వేశాడు .అప్పుడు గుట్టన్న "నేను దిగను .నేను వంద రూపాయలకు ఐదు రూపాయలు ఇచ్చానా ఏమిటి? అట్లా కసరుతావు. నా దగ్గర కూడా చిల్లర లేవు "అని అన్నాడు. అప్పుడు అతని మిత్రుడు వచ్చి కండక్టర్ కు రెండు టికెట్లు ఇవ్వ మనీ , దిగే చోటు పేరు చెప్పి తన దగ్గర ఉన్న చిల్లర డబ్బులు ఇచ్చాడు .దాంతో గొడవ సద్దుమణిగింది.

గుట్టన్న బస్సు దిగిన వెంటనే రోడ్డుపైన ఆ తెల్లని గీతలను, బాణపు గుర్తులను, ట్రాఫిక్ లైట్ లను చూస్తూ మధ్యలో రోడ్డుపై నిలబడ్డాడు. అప్పుడు మిత్రుడు తనకు పరిచయమైన వ్యక్తి తో మాట్లాడుతున్నాడు. రోడ్డుపైన వాహనాలన్నీ ఆగి ట్రాఫిక్ స్తంభించింది. అప్పుడు ఒక వ్యక్తి వచ్చి ఇది గమనించి గుట్టన్నను చేయిపట్టి బిరబిరా లాక్కొని పోయాడు. ఆ వ్యక్తి వాడిని "రోడ్డు మధ్యలో ఎందుకు నిలబడ్డావు "అని ప్రశ్నించాడు. గుట్టన్న "నేను ఈ పట్టణం అందం చూడడానికి వచ్చాను. నన్ను ఎందుకు చేయిపట్టి లాగారు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆ వ్యక్తి "పట్టణం అందం ఇది కాదు. ఇక్కడ చూడాల్సినవి మ్యూజియంలో ఉన్నాయి. అక్కడకు వెళ్లి చూడు. ఇక్కడ నీవు ఇలా ఉంటే ఏదైనా ప్రమాదం నీకే కాకుండా ఇతరులకు కూడా జరుగుతుంది .రోడ్డు మధ్యలో నిలబడడం చాలా తప్పు" అని మందలించాడు .మళ్లీ మిత్రుడు పరుగెత్తి వచ్చి వీడు అమాయకుడని, ఎప్పుడూ పట్టణం చూడలేదని ఆ వ్యక్తికి చెప్పి క్షమాపణలు అడిగాడు .

మిత్రుడు గుట్టన్నను తన బంధువుల ఇంటికి తీసుకొని వెళ్ళాడు .అక్కడ టి.వి.ని మొదటి సారి చూసి గుట్టన్న ఆశ్చర్యపోయాడు. " మీ ఇంట్లో బుల్లి సినిమా ఉంది. ఇది చాలా బాగుంది. ఎక్కడికైనా దీన్ని పట్టుకుని వెళ్ళవచ్చా! "అని ప్రశ్నించాడు? మిత్రుని బంధువులు అవునని తల ఊపారు. "నేను కూడా ఇలాంటిది కొని మా ఊరికి పట్టుకుని పోతాను "అని చెప్పి వారిని దాని ఖరీదు అడిగాడు. వారు దాని ఖరీదు చెప్పగానే నోరెళ్లబెట్టాడు. తర్వాత వారి గది పరిశీలించి చల్లగా ఉండడం చూసి "ఇది ఏమిటి ?చల్లగా ఉంది "అని అడిగాడు . వారు అది " ఏ. సి" అని అన్నారు. " ఇది కూడా బాగుంది .కానీ ఎప్పుడూ ఇలాగే ఉంటే వీరికి చలి కాలం ఎంత కష్టమో పాపం" అని తన మిత్రునితో అన్నాడు. అప్పుడు అతని మిత్రుడు " చలికాలంలో దీనిని ఆపుతారు. అప్పుడు చల్లగా ఉండదు "అని గుట్టన్నతో అన్నాడు. "పట్టణంలో చాలా సుఖంగా ఉంటుంది .అందుకే అందరూ పట్టణాలకు వలస వస్తున్నారు" అని అనుకున్నాడు గుట్టన్న. ఆ రాత్రే గుట్టన్న తన గ్రామానికి బయలుదేరాడు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535.

# బాలిక

పుత్తడి బొమ్మవు నీవు
పునీతవు నీవు
గాజు బొమ్మవు నీవు
గాయాలకు మందువు.

అమ్మవునీవు
అవనికీ ఆధారం నీవు
అబలవు కావు
ఆదరణలో మేటి నీవు.

సమాజ నిర్మాణం నీవు
సమాజంలో సమిధవు నీవు
ప్రేమవు నీవు
పుడమికి జీవం నీవు.

దిక్సూచి వి నీవు
ఎక్కుపెట్టిన విల్లువు నీవు
ఆటవస్తువు కావు
అంది వచ్చిన అదృష్టం నీవు.

కాళివి నీవు
నిన్ను అణచ చూస్తే
కరుణామృతం నీవు
స్నేహ హస్తం అందిస్తే



-సి. హేమలత
9666779103

# ఓట్ల నమోదు విలువ...!!

ఓటువిలువ చూడు ఓర్పునప్రాణంబు
ప్రాణప్రదము నైన పరమనీతి
రౌడిబాసు కొద్దు రాజనీతిజ్ఞుకిమ్ము
రౌతువలెపనుల రాట్టుదేలు!

విలువలున్న మనిషి విపులప్రజాసేవకు
అంకితంబు నీదు ఓటువేయి
మందుడబ్బులకిల మాయలోనబడియు
అరయనాత్మతోడునమ్మబోకు!

యువతులార మీరు యుక్తిగాఓటేసి
మంచివాడి కివ్వు మహినచూడ
నీతిపరుడునెపుడు నియతితోపనులను
చేసిపెట్టి చూపు సేవగల్గి!

యువకులారమీరు యువతరంగమురీతి
ఓట్లు వేయగలరు ఓర్మి తోడ
యువతులుయువకులును
ఓట్లనమోదును
చేసికొనుట వల్ల చెరుపు లేదు!

వ్యక్తిగాదు పనులు వద్దికగనుచేసె
వేగశక్తి వంతు కేయ్యిఓటు
మోము చూపనట్టి మోసగాడికొద్దు
కార్యశీలి కెయ్యి కనగఓటు!



-డా. గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

# మనిషి విషాన్ని చిమ్ముతున్నాడు

మానులను మింగేసి మనిషి
మట్టిని అమ్ముతున్నాడు
అందమైన కొండలను అంగట్లో పెట్టేసి
మనీ కోసం మల్టీ నేషన్స్ కు చిక్కుతున్నాడు

పచ్చని పొలాలను కరిచేసి
కరెన్సీ కట్టలను పేర్చుతున్నాడు
విచ్చలవిడిగా పొగ గొట్టాలను నాటేసి
పుడమిని పొల్యూషన్ తో నింపుతున్నాడు
ఇష్టమొచ్చినట్లు విషాన్ని చిమ్ముతూ
మనిషి విపత్తులను తెస్తున్నాడు.

మనుషుల మధ్యన మంటలను రాజేసి
రుధిరపు టేరులను పారిస్తున్నాడు
కత్తులను మింగేసి మనిషి
కుత్తుకలను తెగ నరుకుతూ
మనుషుల్లో మృగంలా తిరుగుతున్నాడు
వనరులన్నీ అనుభవిస్తూ
భావి తరాల భవితను బూడిద చేస్తున్నాడు.

ప్రకృతి పై కన్నెర్ర జేస్తే
కాలనాగై కాటేస్తది గుర్తించు కో
ప్రకృతి పై కనికరం చూపిస్తే
కనక వర్షం కురిపిస్తది గతించు కో
సత్యాన్ని తెలుసుకో మనిషి
మనిషి లాగా మసలు కో



– తాటిపాముల రమేష్
7981566031

# ఓటు

ఓటు ప్రగతికి మెట్టు
చెయ్యకు మద్యం మత్తులో
దాన్ని చిత్తు
బండికి ఇరుసు
ప్రజాస్వామ్య నికి నీ ఓటు బలం
అయ్యా ఏయ్యు అవ్వా ఏయ్యు
పనిచేసేటోడికే పట్టం కట్టు
ప్రాజాస్వామ్యం కు పట్టం కట్టు
పనిచేయనోన్ని రీకాల్ చెయ్యు
పనిచేసేటోడికి కాల్ చెయ్యు
ఏక్ దిన్ కా సుల్తాన్ కావద్దు
అచ్చుదిన్ గా మార్చు
నిర్భయంగా నీతిగా ఓటు వెయ్యు!వెయ్యు!
నమోదు
ప్రాజాస్వామ్యం ప్రజలది
ఎన్నుకునే వారు మీరే
ఎలు కునేది మీరే
ఎలుకోన బడేది. మీకోసం
మరెందుకు నిర్లక్ష్యం
ఆయుధాలు కూల్చగలవు
పేర్చలేవు
మాటల తూటాలు కావు
నీ భవిత నీ దేశ భవిత
ఓటే అధ్దారం
రాజ్యాంగం ఇచ్చిన ఒక అస్త్రం
ప్రాజాసర్వభౌత్వ రూడి
ఓటు
అందుకే ఓటరు నమోదు బాధ్యతగా
చేసుకో
తోటి వారితో చేయించు
ప్రజాస్వామ్య భవిష్యత్తు మూలం
చైతన్యం కల్గిన ఓటరు
అందుకే మన ఇంటి నుండే
మొదలు అవ్వాలి
ఓటరుగా ప్రాజాస్వామ్యం కు
భూమిక అయ్యి నిలవాలి



-ఉమశేషారావు వైద్య
9440408080

# ఆలోచనల ఆవిష్కరణ...

ఒక్కోసారి
మన ఆలోచనలు
అంతరంగాన అలలై
ఎగిసి ఎగిసిపడతాయి –

ఒక్కోసారి ఆకాశంలో
విహంగాలై విహరిస్తాయి
పాతాళంలోకి జారిపోతాయి
ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిస్తాయి
అగాధపు అంచుల్ని చూపిస్తాయి –

చిమ్మ చీకట్లను చిమ్ముతాయి
వెన్నెల వెలుగుల్ని వెదజల్లుతాయి
పిరికితనాన్ని నూరిపోస్తాయి
వెయ్యి ఏనుగుల బలాన్నిస్తాయి–

పచ్చని చెట్లౌతాయి
చిరునవ్వుల్ని చిగురిస్తాయి
మోడువారిన
మొక్కలౌవుతాయి వెక్కిరిస్తాయి–

కన్నీటి కొలనులౌతాయి
విషాద సరిగమల్ని వినిపిస్తాయి
ఆవేదనా గీతాలను ఆలపిస్తాయి–

ఒక్కోసారి మన ఆలోచనలు
ఎగిరే తారాజువ్వలౌతాయి
రగిలే నిప్పు రవ్వలౌతాయి –

గణ గణ మ్రోగే గంటలౌతాయి
కణకణమండే మంటలౌవుతాయి
గలగల పారే సెలయేరులౌతాయి
జలజల దూకే జలపాతాలౌతాయి–

చల్లని పిల్లగాలులౌతాయి
మదిని పరవశింపజేస్తాయి
వేడి నిట్టూర్పులౌతాయి వేధిస్తాయి –

మన అంతరంగంలో
పాల పొంగులా ఊటలా
ఉప్పొంగే ఈ ఆలోచనలు
నిజానికి అమృత బిందువులే–

మేఘాలలో మెరిసే మెరుపులే
నింగిలో తళుక్కుమనే తారలే
అవి ప్రకృతి ప్రసాదించే వరాలే
అవి పరమాత్మ తలంపులకు ప్రతిరూపాలే

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

# ఓటు వజ్రాయుధం

ఓటు హక్కు మన జన్మహక్కు
ఓటు ప్రజాస్వామ్య సౌధానికి పునాది
ఓటు ప్రగతి పాలనకు బాట
ఓటు వ్యవస్తమార్పుకు సాధనం
ఓటు శాసన నిర్మాతను సృష్టిస్తుంది
ఓటును అమ్మకు అభివృద్ధిని మరువకు
ఓటువిలువ తెలుసుకో
భవితను నిర్ణయించుకో
నోటుకు ఓటు ప్రగతికి చేటు
ఓటు రాజ్యాంగమిచ్చిన వరం
కారాధు మనీ మద్యం పరం
ఓటు ను అమ్ముకోకు
ప్రగతిని నమ్ముకో
నీతి నిజాయితీ గల
ప్రజా ప్రతినిధిని ఎన్నుకో
అక్రమార్కులను అడ్డుకో
అభివృద్ధి కాముకులను ఎన్నుకో
ప్రలోభాలకు లొంగకు
ప్రగతిశీలురకు పట్టం కట్టు
అవినీతి అంతానికి ఓటే
ఓటే వజ్రాయుధం



-నేదునూరి కనకయ్య
9440245771

# మలి విడత కరోనా

మనుషులలో తిరిగినప్పుడు..
మాస్కులు విధిగా ధరించుము.
కరోనా మళ్లీ మొదలైనది..
జాగ్రత్తలను పాటిస్తుండుము..

రోగనిరధకశక్తి వున్నదని.
తోచినట్టు చేయబోకుము.
కరోనా బారిన పడితే..
కాటికి చేరుతవని మరువకుము..

మాస్కులు,శానిటైజర్లు వాడి..
ఆరోగ్యము కాపాడుకొనుము.
అవహేళనలు చేసుకుంటూ..
అందరిని ఇబ్బందిపెట్టకుము..

ఇంటినుండి బయటకెలితే..
చేతి రుమాలు మరచిపోకుము.
సోపతులేవరు కలిసినను..
కరచాలనం ఇవ్వబోకుము..

-పసుల. శంకర్
9542181301

# చిప్పలు

(కథ)

ఎన్నిసార్లు చెప్పినా చిప్పులు, చిప్పులు, అంటావేమే! చిప్స్, చిప్స్ అంటమే రావటల్లే దుటే! కాస్త ఆఖరి మాట దీర్ఘం తీసి మరీ వివ రించింది. సదరు బ్యాంక్ మేనేజర్ భార్య సరళాశర్మ.

"చూడు దొరసాని- యింకో మారు చెబితే నేను చిప్పలు అంటా! శంకరమ్మ కూడ మరింత పూనకం వచ్చిందానిలా "చిప్పలు" అన్న పదం నొక్కి నొక్కి చెప్పింది.

"ఇదిగో నేనెవరి సాని నీ కాదు, నన్నలా 'దొరసాని' అని పిలవద్దన్నానా? ఉక్రోషంగా అంది సరళ.

గట్టిగా నవ్వేసింది శంకరమ్మ.

"చూడవ్వా- నువ్వంటే నాకు అందుకే ఇష్టం. నన్ను దోస్ట్ అంటవ్- నన్ను నమ్ముతావ్- కాని..." శంకరమ్మ గునిసింది.

"కాని ఏవిటీ? నువ్వు నా దోస్ట్ వే- మన మధ్య అంతరాలు పెంచకు, మనమంతా మహిళలం మనదంతా ఒకే జాతి"

సరళ ఉపన్యాస ధోరణిలోకి రాకముందే శంకరమ్మ తాళం వేసింది.

"నేను జల్ది మండలాఫీసుకి పోవాలవ్వా- నా లచ్చ రూపాయల లోన్ మాఫ్ అయింది'. తాఫీగా చెప్పింది శంకరమ్మ.

ఉలిక్కి పడింది సరళ! కాసేపటికి తేరుకొని- నీకు లక్ష రూపాయలేవిటే- అంత లోను నీకెవరిస్తారు? మాఫ్ చేయడం మాట దేముడి తరం కూడా కాదు!"

సరళ చాప వేసి తను సర్దుకు కూర్చుని శంకరమ్మను కూడ కూచో అన్నట్టు ముఖం చూసింది.

చూడవ్వా- నాకు టైమ్ లేదు. ఈ కూచోటం నాగుడెసెలో చిప్పట్టుకు కూచుంటే ఓ లచ్చ రూపాయలు దొరుకుతాయ్!" కూచుంటూనే చెప్పింది శంకరమ్మ.

అదేవిటే శంకరమ్మ- అడుక్కునే వాడికి లక్ష రూపాయలు బిచ్చమేస్తారుటే- ఇలాంటి చచ్చు ఆశలు రాజకీయ నాయకులు ఓట్ల కోసం యిచ్చే ఫ్రాడ్ వరాలు-నమ్మ కూడదు- గెలిచాక మనల్ని ముంచేస్తారు. నచ్చ చెబుతున్నట్లు అంది సరళ. మళ్ళీ ఓసారి నవ్వింది శంకరమ్మ.

"ఎందుకే అలా విరగబడి తెగ నవ్వుతున్నావ్ యివ్వాళ- లక్ష రూపాయలంటావ్ లోను మాఫీ అంటావ్- నేను నీకు చిప్స్ మిషన్ గురించి చెబుతుంటే నువ్వు చిప్పులు, చెప్పులు అంటూ చివరకు" "చిప్పలు" పట్టుకు కూచోటం బెటర్ అంటున్నావ్. మెంటల్ అయ్యావా ఏం?" అర్థం కానట్టు ముఖం పెట్టి అంది సరళ.

"చూడవ్వా- ఊర్లో అందరూ నిన్ను అదే అంటున్రు. 'బ్యాంక్ మేనేజర్ భార్య...) సారే ఖుద్ ఆ మాట చెప్పి మా ఆవిడతో యీ లావాదేవీలు ఏమి చెప్పకండి- మాట్లాడకండి "అన్నారటవ్వా!" శంకరమ్మ చాలా సీదా సాదాగా చెప్పేసింది.

"మా వారా- ఎవరితో అన్నారుట? అసలు మా వారు మహిళలకు లోన్లు యిచ్చే ముందు వాళ్ళు నిజంగా పరిశ్రమలు పెట్టారా లేదా అని చూసి ఫలానా మహిళ పాపడాలు, అగరుబత్తులు, జూట్ సంచులు, పేపర్ బేగులు, పచ్చళ్ళు, జున్ను, బొమ్మలు, ఓ యబ్బో యిలా ఎంతమందికి ఇచ్చారో అన్నీ నాకు చెబుతారు. కాస్త గర్వంగానే చెప్పింది సరళాశర్మ.

"సర్లే నీ పిచ్చి నీది- సారు ఎంతమందికి ఏ పని పాటు లేని వాళ్ళకిచ్చారో నీకేం ఎరుకవ్వా.. ఇప్పుడందరికీ మాఫీ అయిందిగా!" సంబరంగా చెప్పింది శంకరమ్మ.

"ఈ మాఫీ ఏవిటే, చంపుతున్నావ్- ఎవరైనా మిత్తీ- అదే వడ్డీ తగ్గిస్తారేమో కాని, మొత్తం అసలు మాఫీ చేస్తారుటే!

బ్యాంకులు ప్రభుత్వం- అంటే ప్రజలు కుప్పకూలి పోరూ!" ఆశ్చర్యంగా అడిగింది సరళ. మళ్ళీ ఓసారి హాయిగా నవ్వేసింది శంకరమ్మ.

ఈసారి సరళకు ఉక్రోషం వచ్చింది. ఏవిటీ దీని పోకడ! అర్థం కావడం లేదు. ఆరు నెల్ల నుండి శంకరమ్మను తనింట్లో పని మనిషిగా పెట్టుకుంది. శంకరమ్మ చాలా ఫాస్ట్! నలభైపైన ఉన్నా ఓటర్ల లిస్టులో యిరవై తొమ్మిదని నమోదు చేయించుకుంది. ఒకే ఒక ఆడపిల్లకు పదమూడో ఏడొచ్చినా మరో సంతానం లేదేవిటే అంటే భగవంతుడి దయ అంటుంది.

మొగుడు సాంబడంటే శంకరమ్మకు ప్రాణం. సరళ ఆలోచనలు పసిగట్టినట్లు శంకరమ్మ అంది "ఏంటవ్వా- ఆరునెల్ల నుండి యీ తిక్కల్దానికి పేపరు చదివే దాకా చదువు నేర్పిస్తే "ఎందేందో పిచ్చి వాగుడు వాగుతుంది అనుకుంటున్నావు కదూ?"

"అబ్బే అదేం లేదు నీ మొగుడైవన్నా పని చేస్తున్నాడా? ఏదైనా లోను తీసుకొని ఏమైనా వ్యాపారం చేసుకుంటున్నాడా? అడిగింది సరళ.

అయితే నీకు చెప్పానా అవ్వా. ఎలక్షన్లు వస్తే మా యింట్లో రోజు విందే? చికెనూ, మటనూ, బిరియాని తర్వాతయినా దొరలు ఏపనిబడినా మావోడినే పిలుస్తారు. నాలుగేళ్ళు అయిందవ్వా- ఇల్లు కట్టుకునేందుకు లచ్చ సాంక్షన్ అయిందట. అయితే మా చేతికి యాభైవేలు వచ్చాయనుకో.. అప్పుడే నా బిడ్డ పెద్ద పిల్లయింది. ధూమ్ ధామ్ చేసినాం. "ఇల్లు కట్టారా? పూర్తయిందా, మిగిలిన యాభైవేలు యిచ్చారా? సరళ కుతూహలం చూసి నెత్తికొట్టుకుంది శంకరమ్మ.

"ఓ యవ్వ- ఊరికే పెట్టినమ్మను నీ మొగుడితో సమానంగా పెట్టమందంట. యాభై వేలు మాకేముందని యివ్వాల!" ఎదురు ప్రశ్నవేసింది శంకరమ్మ.

"మరి ఎలా తీరుద్దామని తీసుకున్నారు? ఇల్లు కట్టుకొని రుణం తీర్చకుంటే.. మీరున్న ఆ గుడిసె కూడ కబ్జా చేసుకుంటారు." అమాయకంగా లీగల్ పాయింట్ చెప్పింది సరళ.

ఈసారి శంకరమ్మ చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులో కాస్త బాధ తొంగి చూసింది.

> **"ఇదిగో నేనెవరి సాని నీ కాదు, నన్నలా 'దొరసాని' అని పిలవద్దన్నానా? ఉక్రోషంగా అంది సరళ"**

"నా మొగుడికి చదువు లేదు- వ్యవసాయం రాదు. దొరలు చెబితే తన్నిరమ్మంటే తన్నొస్తాడు. పొడిచి రమ్మంటే పొడిచి వస్తాడు. మా ఎస్.సి. కాలనీల్లో నడిపి వయసు నుండి కుర్ర కారంతా మావోడు చెప్పినట్టు వింటారు. ఆడి మాటే వేదం!" బరువుగా అంది శంకరమ్మ.

"మరయితే కుటుంబాలు ఎలా పోషిస్తారు? ఏదైనా నికరాదాయం, రోజుకో, నెలకో, యింతని ఉండాలిగా, కనీసం గుప్పెడు జొన్నపిండి, పిడికిడు బియ్యం, ఓ మిరపకాయ, నూరుకొని తినాలిగా పైగా దొమ్ములాట, కుమ్ములాటలో ఏ క్షణాన ఏమవుతుందో- దొరలకేం సీట్లలో పెవికాల్ అంట బెట్టుకొని కూర్చుని ఆజ్ఞలు పూరమాయిస్తారు."

సరళ పూడిన గొంతు పెగల్చుకొని చెప్పింది. అందుకే నిన్ను పిచ్చి తల్లీ అంటాం. మాకు లోన్లు, బిచ్చాలు మస్తు దొరుకుతాయి. రోజూ బిరియానీ తినకపోయినా, కనీసం ఉప్పుచేప, ఎండు పరిగెలు, లేకుండా మేం ముద్ద మింగం. మేమూ చదువుకుని పనులు నేర్చి "షానీ" అయితే దొరలెట్ల బతకాల? వాళ్ళ పల్లకిలు మోసేదెవరు?" ఎదురు ప్రశ్న వేసింది శంకరమ్మ.

"అయితే యిన్నాళ్ళు నా దగ్గరకొచ్చి నేర్చుకున్న దింతేనా" సరళకు గొంతు పూడుకుపోతోంది.

"లేదవ్వా- నీ దగ్గర మస్తు దునియా తెలుసుకున్నా. కాని ఏం లాభం! నువ్వు నాకు చదవటం నేర్పి చిన్న కూడికలు తీసివేతలు నేర్పినావ్ బాగుంది. బతకటానికి సార్‌కి చెప్పి చిప్పులు- అదేలే చిప్స్ చేసే మిషన్‌కు యిరవై వేలు యిప్పిస్తానన్నావ్. అది తయారు చేయటం పొట్లాలు కట్టడం, అమ్మడం అన్నీ నేర్పావ్. పదేను రోజుల్నాడు. నేనీ మిషన్ ముచ్చట చెబితే "ఇరవై వేలిస్తారా- సరేనన్నాడు" శంకరమ్మ మాట మధ్యలో అడ్డుకొని సరళ అడిగింది.

"మరి యిప్పుడేమయింది?"

"తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిండు"

"ఎందుకు?"

ఇల్లుకు తీసుకున్న లచ్చ రూపాయలలోను మాఫ్ అయిందట. మా ఎస్.సి. కాలనీలో అందరూ డెబ్బై, ఎనభై, లచ్చ, మస్తు తీసుకున్రు. అందర్ని వదిలేసారట. బోడి యిరవై వేలు తీసుకుని సాంబడి పెళ్ళాం కష్టపడి పనిచేసి నెలకు 500 రూపాయలు మిత్తితో కట్టాలా?

ఇక్కడే ఓ చిప్పట్టుకు కూచో- రోజుకొకడ్ని తన్ని 500 రూపాయలు నీ చిప్పలో ఏస్తా" అని కూడ అన్నాడమ్మా" అంది శంకరమ్మ.

" ఈ లక్షల రుణాలు మాఫీ చేయడానికి ఆ పైసలు ఎవడబ్బ జాగీర్లట- ఎవరిళ్ళ నుండి జేబుల్లో నుండి తెచ్చిస్తారట. సొంత పైసలిచ్చారా? రేపు వీళ్ళేవచ్చినా, నిత్యావసరాల మీద రేట్లు, టాక్స్‌లు పెంచుతారు. వేరే వాళ్ళు వచ్చారంటే ఇది తప్పు, అది తప్పు, యింతైనా, కొంతైనా అంటూ హింసిస్తారు.

ఈ పైసల గొడవ వదిలేయ్ చిప్పట్టుకొని కూచుంటే పైసలు రాలతాయి అంటున్నాడే నీ మొగుడు- వాడి బ్రతుకు, వాడిలాంటి కొన్ని వేల శక్తులు నీరుగారి పోతున్నాయి. వారి శక్తి సామర్థ్యాలు, పెద్దల కుట్రల్లో శలబాల్లా ఆహుతయి పోతున్నాయ్. వారిని ఎదగనీయడం లేదు. కులం రిజర్వేషన్స్ పేరుతో మెహర్బాని రుణాలు వారిలోని శక్తి సామర్థ్యాలు అనిచి మరింత పాతాళంలోకి నొక్కేస్తున్నారు."

సరళ ఆవేశంతో చెప్పిన మాటలన్నీ ఏదో మైకులో మంత్రులు చెప్పే ఉపన్యాసాల్లా అనిపించింది శంకరమ్మకు. వింటానికి బాగున్నా పెద్దగా అర్థమయినట్లు లేదు.

"అవ్వా యిక నేను వెళ్ళిరానా- లేటయితే రేపు యిక్కడ పని కూడా వద్దంటాడు" అంది శంకరమ్మ.

వద్దులే నా దగ్గర నువ్వేం పనిచేస్తావ్. నాకంటే నీవే గొప్పదానివి. తప్పో-ఒప్పో ఏం చేసైనా రోజుకి 500 రపాయలు నీ చిప్పలో చిప్పులు- అదే- టిప్స్ వేస్తానన్నాడు సాంబడు. మా ఆయన పొద్దుటి నుండి రాత్రి ఎనిమిదింటి దాక పనిచేసినా యిల్లు పిల్లల మెయింటెనెన్సు నావల్ల కాదంటూ నెలకు ఓ 500 రూపాయలు ఇవ్వలేకపోతున్నానే పెళ్ళామా అంటూ వాపోతున్నాడు.

నేను ఓ చిప్పపట్టుకొని కూచుందామన్నా, ఓ గుడిసె లేదు.

అందుకే నేను చిప్స్ మిషన్-చిప్పులు కాకుండా "చిప్పల కంపెనీ"కి లోన్ యిస్తారేమో కనుక్కుంటాను. ఎందుకంటే నా కులానికి రుణాల మాఫీ లేదు. చచ్చినట్లు తీర్చుకోవాలి.

యిన్నాళ్ళు నీకు చదువు చెప్పినందుకు మీ వాళ్ళందరికీ- నా దగ్గరే చిప్పలు కొనుక్కోమని చెప్పు"

అంది సరళ శర్మ కండ్ల నీరు కొంగుతో వత్తుకుంటూ!



- రాజీవ
సెల్: 9849793914

# ఘనంగా జరిగిన మాతృభాషా దినోత్సవ వేడుకలు


జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి సి. హెచ్. విద్యాసాగర్‌రావు.


అతిథులను ఆహ్వానిస్తున్న అక్షరయాన్ రథసారథి శ్రీలక్ష్మి


సభలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి సి. హెచ్. విద్యాసాగర్‌రావు వేదికపై వి.వి.లక్ష్మీనారాయణ, ఐ.పి.ఎస్. రిటైర్డ్, కె.శ్రీనివాస్, ఆచార్య తంగెడ కిషన్‌రావు.


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు తంగెడ కిషన్‌రావు


వి.వి.లక్ష్మీనారాయణ, ఐ.పి.ఎస్. రిటైర్డ్‌ను సత్కరిస్తున్న ముఖ్య అతిథి సి. హెచ్. విద్యాసాగర్‌రావు

(నేటినిజం ప్రత్యేక ప్రతినిధి)

ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక అంటారు అలాంటి ఎన్నో సిరా చుక్కల కదలిక అక్షరయాన్. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒక వెయ్యి మంది రచయిత్రుల, కవయిత్రుల కూటమి అక్షరయాన్. మూడేళ్లలోనే 40కి పైగా విశిష్ట కార్యక్రమాలు నిర్వహించి అటు భాషకు, ఇటు సామాజిక సేవకు రచయిత్రులను, కవయిత్రులను ప్రోత్సహించే విధంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుంది. మహిళా చైతన్యాన్ని సమాజానికి అందిస్తుంది. సామాజిక సేవయే జీవిత పరమార్ధంగా భావిస్తూ ఏ కలం అయితే సమాజాన్ని చైతన్య పరుస్తూ, సమాజాభివృద్ధిలో తమ పాత్ర పోషిస్తుందో అదే అసలైన జీవితం అంటూ ఎన్నో కార్యక్రమాలతో ముందుకు దూసుకు వెళ్తుంది వెయ్యి మంది మహిళా రచయిత్రుల వేదిక అక్షరయాన్. అందులో భాగంగానే ఫిబ్రవరి 21వ తేదీన హైదరాబాద్, బేగంపేట లోని టూరిజం ప్లాజా హోటల్‌లో గౌ॥సి. హెచ్. విద్యాసాగర్ రావు గారి నేతృత్వంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సి. హెచ్. విద్యాసాగర్ రావు గారు విచ్చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు కిషన్ రావు గారు అధ్యక్షులుగా వ్యవహరించారు. విశిష్ట అతిథిగా వి.వి. లక్ష్మీనారాయణ గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాతృభాష కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన రచయితలను ప్రోత్సహించే భాగంగానే గత సంవత్సరం విశిష్ట ప్రోత్సాహకాలను అందించిన అక్షరయాన్ ఈ సంవత్సరం కొత్తగా 'పంప కవి' పురస్కారాన్ని ప్రకటించింది. మొట్టమొదటగా ఈ పురస్కార గ్రహీతగా ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ గారు విచ్చేశారు. మరో 10మంది సాహితీ స్రష్టలకు పురస్కారాలను అందజేశారు. డా. వడ్డేపల్లి కృష్ణ గారు, యద్దనపూడి రెడ్డి శ్యామల గారు, డా. రాధాకృష్ణ గారు, డా. ముచ్చర్ల రజనీ శకుంతల, ఘాలి లలిత ప్రవల్లిక గారు, భూదేవి, ఆనంద్ విరించి, శ్రీ చందన, ఓట.సమ్రీన్ లకు పురస్కారాలను అందజేశారు. దాదాపు పద్నాలుగు పుస్తకాలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. సభా ప్రారంభంలో మాతృభాష మీద భూదేవి, శ్రీ చందన చక్కటి గేయాలను ఆలపించారు. ముందుగా సమ్మెట విజయ గారు అతిథులకు స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన సమయంలో భూదేవి పాడిన ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. సభకు స్వాగతం పలుకుతూ అక్షరయాన్ వ్యవస్థాపకురాలు అయినంపూడి శ్రీలక్ష్మి అమ్మలు, పల్లెలు మాత్రమే భాషను బ్రతికిస్తున్నాయంటూ అమ్మల నుండి మాత్రమే పాలభాష, పాలనా భాష వరకూ ఎదుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా దాదాపు వెయ్యి మంది ఉన్న అక్షరయాన్ సమూహంలో మూడు సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచంపై ఉండి వీల్ చైర్స్ సహాయంతో సభకు వచ్చిన సుజల గారిని, అలాగే మత సహనాన్ని పాటించమని శతకాన్ని రాసిన 14 ఏళ్ల అమ్మాయి ఓట.సమ్రీన్ ని, బాల వాగ్గేయకారిని శ్రీ చందనను, శతకం వ్రాసిన 14 సంవత్సరాల రామ్ చేతన్ అనే చిన్న అబ్బాయిని, వ్యర్థాలతో అర్థాలను ఎలా తయారు చేయొచ్చో తెలియజేస్తూనే, ఆడవాళ్లలో ఆరోగ్యరీత్యా వచ్చే మార్పులను, తెలుసుకోవలసిన విశేషాలను పుస్తక రూపంలో అందించిన కందేపి రాణి ప్రసాద్ గార్లకు అభినందనలు తెలియజేస్తూ వారిని సభకు పరిచయం చేశారు. అధ్యక్షోపన్యాసం కావిస్తూ తంగెడ కిషన్ రావు గారు పంప కవి యొక్క ప్రాశస్త్యాన్ని, వారి గురించి వివరాలను సభకు తెలియజేయడమే కాక పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా మాతృభాషాసేవ ఏ విధంగా నిర్వహించబడుతుందో విదిత పరిచారు. విశిష్ట అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్న వి.వి. లక్ష్మీనారాయణ గారు అనేక అంశాలను సభికుల దృష్టికి తీసుకువచ్చారు. భాషా పరంగా ఎన్ని వేల భాషలు ఉన్నాయి, ఎంత వరకు అంతరించి పోతున్నాయి, ఏఏ కార్యక్రమాల ద్వారా మనం భాషను ముందుకు తీసుకు వెళ్ళవచ్చో తెలియజేయడమే కాకుండా అక్షరయాన్ కు దిశానిర్దేశం చేస్తూ, కార్యక్రమాలను ఇలా నిర్వహించుకునే సమయంలో ఒక చక్కటి సందేశాన్ని ఇవ్వడంతో పాటుగా పాఠశాలలలో పిల్లలను తయారు చేయటం, వారి చేత మాతృభాషను రాయించటం, అందులో పోటీలు పెట్టడం, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వటం ఇలా ప్రతి ఒక్క పాఠశాలలో కూడా చిన్నతనంనుండే మాతృభాష మీద మమకారం పెరిగే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచనలు అందజేశారు. అనంతరం 'పంప కవి' పురస్కారం అందుకున్న కె.శ్రీనివాస్ గారిని ఘనంగా దుశ్శాలువతో సత్కరించారు. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ తెలుగు భాష అంతరించి పోతుందని చాలా మంది భయపడుతున్నారు కానీ, ఎట్టి పరిస్థితులలో తెలుగుభాష అంతరించే ప్రమాదం లేదని, ఎందుకంటే ఇప్పుడు మనం వాడుతున్న గూగుల్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలు తెలుగులో కూడా లిపిని తయారు చేసుకుంటున్నాయని, వర్చువల్ ప్రపంచంలో తెలుగు భాష వర్ధిల్లుతుందని తెలియజేశారు. 'పంప కవి' పురస్కారం అందజేసిన అక్షరయాన్ కు ధన్యవాదాలు తెలియజేస్తూ, పురస్కారాన్ని తీసుకోవడం తనకు ఆనందంగా ఉందని చెప్పారు. వికారాబాద్ నుంచి వచ్చిన వేణుగోపాల్ గారు తెలుగు భాష మీద చక్కటి పాట పాడి వినిపించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నమనేని విద్యాసాగర్ రావు గారు ఎన్నో అద్భుతమైన విషయాలను వివరించారు.

మాతృభాషలో పరిపుష్టి అయిన వ్యక్తి ఏ భాషలోనైనా సంపూర్ణత సాధించగలుగుతాడని చెబుతూ 'ప్రపంచ తెలుగు విశ్వవిద్యాలయం' ఒకటి కావాలనే తన ఆకాంక్షను తెలియజేశారు. అలాగే అన్ని జిల్లాలలో కూడా మాతృభాషకు సంబంధించి ఒక సంస్థను ఏర్పాటు చేయాలని, ఆ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు జరపాలని అలా జరిగినప్పుడే మాతృభాషా సేవ పరిపుష్టం అవుతుందని, విద్యార్థుల్లో చిన్నప్పటి నుండి కూడా మాతృభాషాభిమానం మొలకెత్తించాలని కూడా వారు తెలియజేశారు. అలాగే ప్రాచీన భాషా అధ్యయన కేంద్రాన్ని హైదరాబాదులో కూడా ప్రారంభించాలని, ఒకప్పుడు మైసూర్ నుంచి నెల్లూరుకి వచ్చిన భాషా అధ్యయన కేంద్రం నెల్లూరులోనే స్థిరపడిందని, మరొకటి తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు. భాషాపరంగా అన్ని రాష్ట్రాలకూ కేంద్రం తోడ్పాటు అందించాలని, తెలుగు వర్సిటీ అనుబంధ కేంద్రం ద్వారా అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో సుమారు 10 వేల మంది ప్రవాస భారతీయుల పిల్లలు తెలుగు నేర్చుకుంటున్నందుకు కిషన్ రావు గారిని అభినందించడం జరిగింది. తదుపరి సాహిత్యంలోని అన్ని అంశాల పట్ల సృజన చేసిన డా. వడ్డేపల్లి కృష్ణ గారికి విశిష్ట సేవా పురస్కారాన్ని అందజేశారు. నిఘంటు నిర్మాణంలోను, పదసంపద ఉత్పత్తి చేయడంలోను, పాఠ్య పుస్తకాల ప్రణాళికలను సిద్ధం చేయడంలో ప్రసిద్ధి పొందిన యద్ధనపూడి రెడ్డి శ్యామల గారిని సత్కరించారు. తదుపరి రచయిత్రిగా, నవలాకర్తగా పేరుపొందిన డా. రాధాకుసుమ గారిని సత్కరించడం జరిగింది. సామాజిక కార్యకర్తగా ఎన్నో సామాజిక కార్యక్రమాలకు ఇతోధికంగా సేవలందించడంతో పాటు చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఇటు సాహితీ సృజనగావిస్తూ కొన్ని వేల లలిత గీతాలను రచించి ఎంతో మందికి ఆదర్శంగా నిలవడంతో పాటు అనాథ బాలలను ఆదుకోవడంలో అందెవేసిన చేయిగా పేరుపొందిన శశిబాల గారిని సన్మానించడం జరిగింది. అలాగే నవలాకారిణిగా మనందరికీ సుపరిచితం అయిన డా.ముచ్చర్ల రజనీ శకుంతల గారిని సన్మానించడం జరిగింది.

భాష పట్ల విశ్వాసాన్ని కలుగ చేయడంతో పాటుగా బాలలందరినీ సమైక్య పరిచి అక్షరయాన్ బాలుర, బాలికల విభాగాలకు అధినేత్రి గా పనిచేస్తూ వారి చేత శతకాలను వ్రాయించేటంత పాండిత్యాన్ని అందిస్తున్న ఘాలి లలిత ప్రవల్లిక గారిని సన్మానించడం జరిగింది. మాతృ భాషలో పాటలు పాడుతూ అలాగే, దేశభక్తి గీతాలను తానే రచించి ఆలాపిస్తూ ఎంతో మందిలో స్ఫూర్తిని రగిలిస్తున్న భూదేవి గారిని సత్కరించడం జరిగింది. అనేక గవర్నమెంటు పాఠశాలలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ, కంప్యూటర్ల ద్వారా పిల్లలకు తెలుగు ఏవిధంగా నేర్పించవచ్చో వివరిస్తూ గవర్నమెంట్ పాఠశాలలకు తనవంతు సేవలను అందిస్తున్న ఆనంద్ విరించి గారిని సత్కరించడం జరిగింది. వీరు సినిమాలకు గీతాలను కూడా రచించారు. తిరుపతి వేంకటేశ్వరుని పై పాటలను స్వయంగా రాసి, పాడుతున్న బాల వాగ్గేయకారిణి శ్రీచందనను, అలాగే మత రహిత దేశం కావాలంటూ శతకం రాసిన ఎట. సమ్రీన్ ను కూడా పరిగణలోకి తీసుకుని వారికి కూడా సత్కరించటం జరిగింది. రమాదేవి కులకర్ణి గారి వ్యాఖ్యానంతో సన్మాన కార్యక్రమం ముగిసిన అనంతరం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విశ్వైక తన వ్యాఖ్యానంతో కొనసాగించారు. మొదటగా జ్యోతి వలబోజు గారి ప్రచురణలో విడుదలైన 'కృష్ణశాస్త్రి సాహిత్యం–సౌందర్య తత్వం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పి.ఎస్.ఎం.లక్ష్మి గారి 'రేపటి తరం సైంటిస్ట్' పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. 'తిరుప్పావై కవితలు' వేముల ప్రేమలత గారి పుస్తకాన్ని, వనజా వల్లంభట్ల గారి 'వాణి శతకాన్ని', వై.మంజులత గారి 'కవితా స్రవంతి' ని, లలితావర్మ గారి 'హవేలి' నవలను, అయినంపూడి శ్రీలక్ష్మి గారు, సుధాశేఖర్ గారు కలిసి రచించిన 'కనకాంబరాలు' పుస్తకాన్ని , వైరాగ్యం ప్రభాకర్ గారు రచించిన 'అక్షర ప్రేమికుడు' పుస్తకాన్ని, 'జోడెడ్ల బండి' బొమ్మ విమల గారి పుస్తకాన్ని , మన్నె లలిత గారి 'కళానిధి' పుస్తకాన్ని, 'నా జ్ఞాపకాల్లో అమ్మ' కందేపి రాణి ప్రసాద్ గారి పుస్తకాన్ని , ఇంకా ధీకొండ చంద్రకళ గారి 'సున్నితం చంద్రికలు', వలిపే రామ్ చేతన్ రాసిన 'అక్షర చైతన్యం' పుస్తకాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం అనంతరం అతిథులను సత్కరించుకుని, చక్కటి తెలంగాణ వంటకాలతో భోజనాలు అందించి యశోద, సమ్మెట విజయ గారి వందన సమర్పణతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. రాబోయే మాతృభాషా దినోత్సవం నాటికి ఎంతో మంది బాలకవులను, అలాగే మరిన్ని మాతృభాషా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ ప్రతి జిల్లాలో కూడా కొన్ని సంస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా మంచి కార్యక్రమాలను అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు ముగిశాయి.


ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్‌కు 'పంపకవి' పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు.

**సామాజిక సేవయే జీవిత పరమార్ధంగా భావిస్తూ ఏ కలం అయితే సమాజాన్ని చైతన్య పరుస్తూ, సమాజాభివృద్ధిలో తమ పాత్ర పోషిస్తుందో అదే అసలైన జీవితం అంటూ ఎన్నో కార్యక్రమాలతో ముందుకు దూసుకు వెళ్తుంది వెయ్యి మంది మహిళా రచయిత్రుల వేదిక అక్షరయాన్.**

పురస్కారం పొందుతున్న సాహిత్య స్రష్టలు.















































